## క్లుప్తంగా

### పారదర్శకంగా పరిశీలించండి



నర్సాపూర్ వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న కమిషనర్, హౌసింగ్ డీఈలు

**నర్సాపూర్:** ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, హౌసింగ్ డీఈ సంజీవరెడ్డి సూచించారు. వారు మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్లతో సోమవారం కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తుల విచారణ సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. కాగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఈనెల 31 వరకు ప్రభుత్వం ఫీజు చెల్లించే వారికి ప్రభుత్వం 25శాతం రాయితీ అవకాశం కల్పించిందని కమిషనర్ వివరించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారుల సహాయార్థం తమ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

### మన్నె కులానికి గుర్తింపు ఇవ్వాలి

**నర్సాపూర్:** మన్నె కులానికి తగిన గుర్తింపు ఇవ్వాలని మన్నె కుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మన్నె కులసంఘం ప్రతినిధులు సూరారం నర్సింలు, యాదగిరి, పాపయ్య, బాల్‌రాజ్, గంగారాం తదితరులు నర్సాపూర్‌లో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తమ కుల జనాభా మేరకు తమకు గుర్తింపు లభించడం లేదని, ఇతర కులాల వ్యక్తులు తమ కులాన్ని అణిచి వేసేందుకు చూస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సూచించిన విధంగా తమను చేర్చాలని వారు కోరారు.

### ఏర్పాట్లు సక్రమంగా ఉండాలి



చిలప్‌చెడ్‌లో పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ విఠల్

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు అన్ని సక్రమంగా ఉండాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. సోమవారం ఆయన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలతో పాటు ఓ కేజీబీవీ ఉండగా, ఐదు ఉన్నత పాఠశాలల విద్యార్థులు 196 మంది చిలప్‌చెడ్ కేంద్రంగా పరీక్ష రాయనున్నారని, చిట్కుల్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు 68 మంది కొల్చారం మండలం రంగంపేట కేంద్రంలో పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గదుల్లో మౌలిక వసతులు ఉండాలన్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేశ్ ఉన్నారు.

### ముదిరాజ్ భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు

**కొల్చారం(నర్సాపూర్):** మండలంలోని పైతర గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని సోమవారం ఆ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. భవన నిర్మాణం కోసం ప్రత్యేక నిధుల ద్వారా ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి స్లాబ్ గోడల వరకు భవనం పూర్తి చేసిన సమయంలో నిధుల లేమి ఇబ్బందికరంగా తయారైంది. దీంతో సంఘం సభ్యులు సొంతంగా మరో రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి భవనాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగంపల్లి మల్లేశం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం సభ్యులు ఉన్నారు.

### వాల్ పోస్టర్ ఆవిష్కరణ



రక్త, అవయవదాన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లయన్స్ గవర్నర్ నగేశ్

**రామాయంపేట(మెదక్):** స్థానిక లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి రూపొందించిన రక్తదాన, అవయవదాన ప్రచార వాల్ పోస్టర్‌ను ఆదివారం రాత్రి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ నగేశ్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రాగి కన్వెన్షన్‌లో జరిగిన లయన్స్ సమావేశంలో జిల్లాకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ఈ విషయమై ప్రచారం ఇంకా ఉధృతంగా కొనసాగాలని ఆయన సూచించారు. క్లబ్ జాతీయ, అంతర్జాతీయ సభ్యులతో పాటు జిల్లా, స్థానిక క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా సోమేశ్వరాలయ ఉత్సవాలు

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో వెలసిన సోమేశ్వరాలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా సుబ్రహ్మణ్య స్వామి, నాగులమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సుధాకర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనురాధ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో భక్తులు

## భక్తిశ్రద్ధలతో మల్లన్న ఆలయ వార్షికోత్సవాలు

**మనోహరాబాద్(తూప్రాన్):** మండల కేంద్రంలో మల్లన్న ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం యాదవసంఘం ఆధ్వర్యంలో మల్లన్న దేవాలయం వద్ద పెద్దపటం వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లన్న కల్యాణం నిర్వహించారు. గ్రామ మహిళలు పెద్ద ఎత్తున్న బోనాలతో ఊరేగింది మల్లన్నకు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శించుకున్నారు.



బోనాలతో మహిళలు

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్

**తూప్రాన్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మణ్ అధ్యక్షతన ఘనంగా జరుపుకొన్నారు. ఈ సదర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని , మహిళా సాధికారత కోసం ప్రస్తుత సమాజంలో అందరూ పని చేయాలన్నారు. మహిళలను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు అమరవాణి, జ్యోతి, దుర్గా, వనిత, పద్మ, శ్రీవాణి, నుస్రత్, అరుణ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

**కూకుట్లపల్లిలో..**

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని కూకుట్లపల్లిలో మహిళా అధికారులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ సుజాత కాంతారావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు శ్రావణి, సరోజ, ఏఎన్‌ఎం మాధురి, ఆశవర్కర్ సుగుణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సువర్ణ, అంగన్‌వాడీ ఆయా బిస్మిల్లాను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంజేందర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాయకులు వెంకన్న, ఎక్బాల్, కుమార్, కొండల్, ముర్షద్ తదితరులు పాల్గొన్నారు.



కూకుట్లపల్లిలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు



తూప్రాన్: ప్రభుత్వ పాఠశాలలో..

# ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

**నర్సాపూర్ రూరల్:** మండలంలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి సోమవారం పర్యటించారు. చిన్నచింతకుంట గ్రామంలో ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠతో పాటు నారాయణపూర్‌లో మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాపూర్‌లో రూ. 18 లక్షలతో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



చిన్నశంకరంపేట(మెదక్): సూరారం జెడ్పీపాఠశాలలో..

**చిన్నశంకరంపేట(మెదక్):** పదో తరగతిలో పదికి పది గ్రేడ్ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తానని ఎన్‌ఆర్‌ఐ చంద్రశేఖర్ ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి పాల్గొన్నారు. అలాగే సూరారం జెడ్పీపాఠశాల విద్యార్థులకు శ్రీనివాస్ పరీక్ష ప్యాడ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి పాల్గొన్నారు.

**పాపన్నపేట ఉన్నత పాఠశాలలో..**

**పాపన్నపేట(మెదక్):** పది విద్యార్థులకు ఓ ఉపాధ్యాయుడు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. సోమవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో టీచర్ యాదయ్య ఆ పాఠశాలలో చదువుతున్న 120 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, కంపాస్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, టీచర్లు వెంకటేశం, రమేశ్, మోహన్ రావు, వేణుగోపాల్ రెడ్డి, నర్సింలు, రియాజ్, కృష్ణకాంత్, రవికాంత్, విశ్వనాథ్, పద్మ ఇందిర, రజిత పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందించిన ఎన్‌ఆర్‌ఐ చంద్రశేఖర్

## గ్రామ దేవతలకు బోనాలు

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** మండల పరిధిలోని గౌతాపూర్‌లో గ్రామ దేవతలకు సోమవారం మహిళలు ఘనంగా బోనాలు ఊరేగించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల శిగాలు, పోతురాజుల విన్యాసాలతో, యువకుల నృత్యాలతో బోనాలను ఊరేగించి గ్రామదేవతలకు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్, శంకరయ్య, భీమయ్య, గోవర్ధన్‌రెడ్డి, వెంకయ్య, గోవర్ధన్‌రెడ్డి, గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



గౌతాపూర్‌లో గ్రామ దేవతలకు బోనాలు తీస్తున్న మహిళలు

## పరామర్శ

**చిన్నశంకరంపేట(మెదక్):** బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి నందారెడ్డి తండ్రి బాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరిపల్లిలో అంత్యక్రియలు జరగగా, నందారెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీల విద్యుత్ బకాయిలు మాఫీ చేయాలి

**చిన్నశంకరంపేట(మెదక్):** ఎస్సీ, ఎస్టీల విద్యుత్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసి, గృహజ్యోతి పథకం అమలు చేయాలని నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నప్పటికీ బకాయిలతో పేదలకు ఈ పథకం అందకపోగా, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే పాత బకాయిలు మాఫీ చేసి గృహజ్యోతి పథకం అమలు చేయాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ నిరుపేద కుటుంబాలకు న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

### అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తీగుల్, అలిరాజ్‌పేట, లింగారెడ్డిపల్లిలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామాల్లోని ఎస్సీ కాలనీలను స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# నైపుణ్యాలతోనే స్వయం ఉపాధి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్

**నర్సాపూర్ రూరల్:** నేర్చుకున్న నైపుణ్యాలతోనే స్వయం ఉపాధి పొందొచ్చని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మెహందీ, మార్షల్ ఆర్ట్స్‌లపై నెలరోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలతో కూడిన ఆయా రకాల కోర్సులను నేర్చుకోవాలని సూచించారు. నర్సాపూర్ ప్రభుత్వ కళాశాలలో మెహందీ, మార్షల్ ఆర్ట్స్‌కు సంబంధించి శిక్షణ తరగతులను నిర్వహించినట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణతో పాటు సర్టిఫికెట్లను అందజేసే కోర్సుల్లో చేరాలని సూచించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మైనాడు సాధించిన విజయాలపై విద్యార్థులకు వివరించారు. ప్రముఖ మహిళలు సాధించిన విజయాలపై పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ సమీరా నజరిన్, అధ్యాపకులు డాక్టర్ అనిత, సురేశ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు సాధించిన విజయాల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్

# పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించండి

**వెల్దుర్తి(తూప్రాన్):** పెండింగ్‌లో ఉన్న బిల్లులు సకాలంలో చెల్లించి, తమకు సహకరించాలని విద్యుత్ వినియోగదారులకు ఏఈ పెంట్యానాయక్ సూచించారు. వెల్దుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో బిల్లులు చెల్లించకుండా డిఫాల్టర్లుగా 553 మంది ఉండగా, సుమారు 50 మంది వినియోగదారులు ఇటీవల చెల్లించారని మిగతా 500 మంది పై చిలుకు డిఫాల్టర్ల జాబితాలోనే ఉన్నారన్నారు. వారు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే గృహ విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని ఉప్పులింగాపూర్, వెల్దుర్తి గ్రామాల్లో డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు కేటాయించిన విద్యుత్ మీటర్ల బిల్లులు ప్రస్తుతం విద్యుత్ సబ్ ఇంజనీర్ పేరిట జనరేట్ అవుతున్నాయన్నారు. ఆయా లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్రూం మంజూరు పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే గృహ యజమాని పేరిట విద్యుత్ మీటర్‌ను మార్చుతామన్నారు. ఏడాది కాలంగా విద్యుత్ వినియోగించినందుకు డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి సుమారు రూ.1,200 వరకు వచ్చాయని, వాటిని వెంటనే చెల్లించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.



పెంట్యానాయక్, విద్యుత్ ఏఈ, వెల్దుర్తి

# ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ

**రేగోడ్(మెదక్):** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యానిలయం, మోడల్ స్కూల్‌లోని సుమారు ఐదు వందల మంది బాలికలకు సోమవారం మనం వాసవి క్లబ్ అశోక్ నగర్ బాధ్యులు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ డీఈఓ రాధకిషన్, క్లబ్ డైరెక్టర్ నర్సింహులు, జిల్లా గవర్నర్ జ్యోతిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. డీఈఓ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడంపై బాధ్యులను అభినందించారు. పేద విద్యార్థులకు అందించిన చేయూత మరిచిపోలేనిదని, విద్యార్థులు కూడా పరీక్షల్లో వందకు వంద మార్కులు సాధించి వాసవి క్లబ్ బాధ్యులకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురునాథ్, క్లబ్ అధ్యక్షులు వెంకట తేజ, ఐపీసీ మనోజ్ కుమార్, కార్యదర్శి నరేందర్, జేసీ నాగలక్ష్మీ, సింధూజ, డాక్టర్ వికాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రమీల, కస్తూర్బాగాంధీ ప్రిన్సిపాల్ స్వయంప్రభ తదితరులు పాల్గొన్నారు.



వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ

# కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం

కరాటే ఎగ్జామినర్, పీడీ ప్రతాప్‌సింగ్

**కౌడిపల్లి(నర్సాపూర్):** బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు కరాటే దోహదం చేస్తుందని కరాటే ఎగ్జామినర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. సోమవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో కౌడిపల్లి, కొల్చారం మండలంలోని విద్యార్థినులకు కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. బాలికలు కరాటే నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా మానసికంగా దృఢంగా ఉంటారని చెప్పారు. రెండు మండలాల్లోని పలు పాఠశాలలకు చెందిన 130మంది విద్యార్థినులు కరాటే పరీక్షల్లో పాల్గొనగా బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, కరాటే మాస్టర్లు, నగేష్, ప్రసన్న, భూపాల్, దినకర్, గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో కరాటే బెల్ట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

## సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ నిర్మాణానికి రూ. 51 వేల విరాళం**



**చిలప్‌చెడ్(నర్సాపూర్):** మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి చండూర్ గ్రామానికి చెందిన చౌటకూరి గోవర్ధన్‌రెడ్డి–చంద్రశేఖర్‌రెడ్డి బ్రదర్స్ తమవంతు సాయంగా రూ. 51 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామపెద్దలు చౌటకూరి బ్రదర్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శంకరయ్య, భీమయ్య, గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు గుప్తా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

**అల్లాదుర్గం(మెదక్):** మండలంలోని కల్యాణ లక్ష్మి పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన లబ్ధిదారులకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నిరుపేదలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాశ్‌రావు, సురేశ్, ప్రభు, శ్రీశైలం, సాయిబాబా, వెంకట్, పోచయ్య, చంద్రశేఖర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



◆ **పెద్దమ్మతల్లి ఆలయ గడపపూజ**



**కొల్చారం(నర్సాపూర్):** మండలంలోని ఎనగండ్లలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ గడపకు పూజ నిర్వహించారు. పురోహితుల మంత్రం మధ్య ఆలయ గర్భగుడికి గడపను ప్రతిష్ఠించారు. తాజా మాజీ ఎంపీపీ మంజుల దంపతులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **ప్రసాద్ ఆశయ సాధనకు కృషి**

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రం మాజీ సర్పంచ్ దివంగత ప్రసాద్‌గౌడ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని హైకోర్టు న్యాయవాది, ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రసాద్‌గౌడ్ 21వ వర్ధంతి సందర్భంగా గూడూర్‌లోని ఆయన విగ్రహం పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన పేరిటి ట్రస్ట్ నెలకొల్పి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని సేవ కార్యక్రమాలు విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



◆ **డంప్‌యార్డును ఎత్తివేయాలి**

**నర్సాపూర్:** డంప్‌యార్డును ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 22వ రోజుకు చేరాయి. దీక్షల్లో పదో వార్డు నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్యారానగర్‌లో డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులు, చెరువు కలుషిత మవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షల్లో శ్రీధర్‌గుప్తా, బుచ్చేష్‌యాదవ్, జ్ఞానేశ్వర్, నర్సింహ్మారెడ్డి, రాజేందర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

